ప్రజాశక్తి

శుక్రవారం 24 అక్టోబర్ 2025 5 విజయనగరం

## నేటి నుంచి తైక్వాండో ఛాంపియన్‌షిప్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 24, 25తేదీల్లో స్థానిక విజయనగరం ఇండోర్ రాజీవ్ స్పోర్ట్సు కాంప్లెక్సులో తైక్వాండో అసోషియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, విజయనరం జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్వర్యంలో 42వ జూనియర్, 8వ క్యాడెట్ తైక్వాండో పోటీలు జరగనున్నాయి. పోటీలకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల నుండి సుమారు 250 మంది తైక్వాండో క్రీడాకారులు హాజరు కానున్నారు. జూనియర్ విభాగంలో రాష్ట్రస్థాయి విజేతలంతా ఈనెల 30నుండి నవంబర్ 3వరకు బెంగుళూరులో జరుగు జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు. రాష్ట్ర పోటీలు గోడ పత్రికను గురువారం విడుదల చేశారు. కార్యక్రమంలో జిల్లా తైక్వాండో అసోసియేషన్ నాయకులు డివి చారి ప్రసాద్, కోచ్‌లు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణ లక్ష్యం..

# 4.50 లక్షల మెట్రిక్ టన్నులు

- నవంబర్ నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- 511 ఆర్‌ఎస్‌కెల ద్వారా సేకరణ

ప్రజాశక్తి - కంటోన్మెంట్

నూర్పిడి చేస్తున్న రైతులు (ఫైల్)

జిల్లాలో ధాన్యం కొనుగోలుకు రంగం సిద్ధమవుతోంది. జిల్లా వ్యాప్తంగా 511 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 511 రైతు సేవా కేంద్రాలను 192 క్లస్టర్‌లుగా విడదీసి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. గతంలో జరిగిన పొరపాట్లు నివృత్తి చేసుకొని భవిష్యత్తులో ఎటువంటి పొరపాట్లు లేకుండా ధాన్యం కొనుగోలు చేయడానికి జిల్లా సహకార అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగు లక్షల 50 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 5 లక్షలకు పైగా మెట్రిక్ టన్నులు ధాన్యం ఉత్పత్తి వస్తుందని అధికారులు అంచనా వేశారు. వీటిని కొనుగోలు చేసేందుకు జిల్లాలో 65 పిఎసిఎస్‌లకు గాను 56 సొసైటీలను 192 క్లస్టర్‌లు గా విభజించి ధాన్యం సేకరణకు ఏర్పాటు చేశారు .ప్రతి క్లస్టర్ కు టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, హెల్పర్‌ను నియమిస్తారు. ఇందులో టెక్నికల్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్ల నియామకం చేపట్టారు.

### ధాన్యం సేకరణ ఇలా..

రైతులు ముందుగా రైతు సేవ కేంద్రాల్లో ట్రక్‌షీట్ తీసుకోవాలి. సిబ్బంది వెళ్లి రైతు వద్ద ధాన్యం పరిశీలించి తేమ, పొల్లు, రాళ్లు లేకుండా (ఫెయిర్ యావరేజ్ క్వాలిటీ)ని తెలుసుకునేందుకు ధాన్యం సాంద్రత పరీక్షలు నిర్వహిస్తారు. ఆ తర్వాతే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు రైతులు తీసుకువెళ్లాలి. ఆర్‌ఎస్‌కెలో ఉన్న మిషన్ ద్వారా మాత్రమే ధాన్యం కొలతలు చేయాలి. రైతు నుంచి ఎఫ్‌టిఒ అయినా 48 గంటల్లో రైతు అకౌంట్‌లో డబ్బులు పడేలా ఏర్పాట్లు చేశారు. ధాన్యాన్ని మిల్లుకు సరఫరా చేసే వాహనాలకు జిపిఎస్ విధానాన్ని అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో రైతులు మిల్లుల వద్దకు ధాన్యాన్ని వాహనాల ద్వారా తరలించేవారు. నేడు అటువంటి ఇబ్బందులు లేకుండా రైతు సేవా కేంద్రాల నుండి మిల్లర్లే వాహనాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని తరలిస్తారు. గతంలో ఒక్కోబ్యాగ్ కు నాలుగైదు కేజీలు మిల్లర్లు ఎక్కువగా తూకాలు వేసేవారు. అటువంటి వాటికి చెక్ పెట్టి 40 కేజీల గన్నీ బ్యాగ్‌లు మాత్రమే ఏర్పాటు చేస్తున్నారు. కొలతలు సక్రమంగా ఉండేలా అధికారులు ఏర్పాటు చేశారు.

### నవంబర్ మొదటి వారం నుంచే

రాష్ట్ర ప్రభుత్వం నవంబర్ మొదటి వారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ధాన్యం సేకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. సుమారు కోటి గన్ని బ్యాగులను సిద్ధం చేశాం. నాలుగున్నర లక్షల టన్నుల ధాన్యం సేకరణ చేపట్టనున్నాం. ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకుంటాం.

- పి. రమేష్,
జిల్లా సహకార అధికారి

## మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యం

### ఎస్‌ఎఫ్‌ఐ ఖండన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు జ్వరాలు సోకిన విషయంలో గిరిజన సంక్షేమ శాఖా మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేసిన వ్యాఖ్యలను ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ ఒక ప్రకటనలో గురువారం ఖండించారు. మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యలు బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని దుయ్యబట్టారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు సరైన మౌలిక సదుపాయాలు ఉండడం లేదని, ముఖ్యంగా గిరిజన ప్రాంతంలో ఉన్న ఆశ్రమ పాఠశాలల కిటికీలుకి మెస్‌లు లేకపోవడం వల్ల దోమలు నిత్యం స్వైర విహారం చేస్తున్నాయని తెలిపారు. చాలాచోట్ల తాగడానికి మంచి నీటి సౌకర్యం లేదని, ఏదైనా అనారోగ్యం సంభవిస్తే ప్రాథమిక వైద్యం అందించడానికి సరిపడా మందులు ఉండడం లేదని తెలిపారు. ఎటువంటి హెల్త్ క్యాంపులూ నిర్వహించడం లేదన్నారు. ఆహారంలో నాణ్యత లోపించడం వలన విద్యార్థులకు పౌష్టికాహారం లోపిస్తుందన్నారు. ఈ కారణాల వలన విద్యార్థులు జ్వరాలు బారిన పడుతున్నారని తెలిపారు. ఇప్పటికే పార్వతీపురం మన్యం జిల్లాలో ఐదుగురు విద్యార్థులు జ్వరం వల్ల ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. విద్యార్థులకు సరైన వైద్య సదుపాయాలు అందించకుండా గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మాట్లాడుతూ రోగాలు వస్తే తామేం చేయాలి అనడం బాధ్యతారాహిత్యమేనని పేర్కొన్నారు. ఇప్పటికైనా విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మత్స్యకారుల కుటుంబాలతో మాట్లాడుతున్న ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే లోకం మాధవి

# మత్స్యకారులను రప్పించేందుకు చర్యలు

## కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి

ప్రజాశక్తి-కంటోన్మెంట్, భోగాపురం

బంగ్లాదేశ్ నేవీకి చిక్కిన జిల్లాకు చెందిన ఎనిమిది మంది మత్స్యకారులను స్వదేశానికి క్షేమంగా రప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లో చర్యలు వేగవంతం చేసిందని జిల్లా కలెక్టర్ ఎస్. రామసుందర్ రెడ్డి తెలిపారు. సముద్రంలో చేపల వేటకు వెళ్లి పొరపాటున బంగ్లాదేశ్ సముద్ర సరిహద్దులోకి ప్రవేశించిన ఈ మత్స్యకారుల పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమై, కేంద్ర విదేశాంగ మంత్రిత్వశాఖతో నిరంతరం సంప్రదింపులు కొనసాగిస్తోందని కలెక్టర్ చెప్పారు. ఈ నేపథ్యంలో న్యూఢిల్లీలోని ఎపి భవన్ ద్వారా అధికారిక చర్చలు కొనసాగుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే విదేశాంగ మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ బి. శ్యామ్ ను సంప్రదించి కేసు పురోగతిని తెలుసుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు అందిన సమాచారం ప్రకారం, బంగ్లా దేశ్‌లో మత్స్యకారులపై ఛార్జిషీట్ దాఖలయిందని, అయితే ఢాకాలోని భారత హైకమిషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయబృందం వారిని రక్షించేందుకు అవసరమైన న్యాయ సహాయాన్ని అందిస్తోందని వివరించారు. బాధిత కుటుంబాలను జిల్లా యంత్రాంగం నిరంతరం సంప్రదిస్తూ, వారికి అన్ని రకాల సహాయాన్ని అందించేందుకు చర్యలు తీసుకుంటోందని కలెక్టర్ పేర్కొన్నారు.

### బాధిత కుటుంబాలను ఓదార్చిన ఎమ్‌పి, ఎమ్మెల్యేలు

విశాఖలో ఉన్న మత్స్యకార బాధిత కుటుంబాలను ఆర్‌డిఒ డి.కీర్తి గురువారం కలిసి ధైర్యం చెప్పారు. బంగ్లాదేశ్ నుండి రప్పించడానికి ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటుందని, ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలు అడ్రస్‌లు, బాంక్ అకౌంట్ వివరాలను తీసుకొని, అన్ని విధాలా అండగా ఉంటామని వారికి చెప్పారు. ఎమ్‌పి కలిశెట్టి అప్పలనాయుడు, నెల్లిమర్ల ఎంఎల్ఎ లోకం నాగ మాధవి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ బంగార్రాజు కూడా బాధిత కుటుంబాలను కలిసి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వివరించారు.

## సకాలంలో ధాన్యం కొనాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

జెసితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బేబినాయన

రైతుల నుంచి ధాన్యం సకాలంలో కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జెసి సేతు మాధవన్‌ను ఎమ్మెల్యే బేబినాయన కోరారు. కలెక్టరేట్‌లో గురువారం బుడా ఛైర్మన్ తెంటు లక్ష్మునాయుడుతో కలిసి జెసిని కలిశారు. రైతుల నుంచి ధాన్యం సేకరణ, ఆర్‌టిసి కాంప్లెక్స్ నుంచి రాజా కళాశాల రోడ్డు ప్రతిపాదనలు, ఇండోర్ స్టేడియం పనులపై జెసితో చర్చించారు. నియోజకవర్గ సమస్యలను జెసికి వివరించారు.

## అనుమతులు లేని నిర్మాణాలపై ఉపేక్షించేది లేదు

### కమిషనర్ నల్లనయ్య

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనుమతులు లేని నిర్మాణాలపై ఉపేక్షించేదిలేదని నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. గురువారం తమ కార్యాలయంలో ప్రణాళిక అధికారులు, కార్యదర్శులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయాల వారీగా ప్రణాళికపరమైన పలు అంశాలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరంలో అనుమతులు లేని భవన నిర్మాణాలను ఉపేక్షించవద్దని ఆదేశించారు. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు తక్షణమే పరిష్కారం అయ్యే విధంగా చూడాలన్నారు. పెండింగ్ లో ఉన్న బిపిఎస్ దరఖాస్తులను కూడా పరిష్కరించాలని చెప్పారు. ప్రతిరోజు క్షేత్రస్థాయిలో పర్యటించి సచివాలయాల పరిధిలో అక్రమ నిర్మాణాలను గుర్తించి తక్షణమే తొలగించాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, సర్వేయర్ సింహాచలం,టిపిఒ అప్పలరాజు, టిపిఎస్ అనిత, పాల్గొన్నారు.

# స్కాలర్‌షిప్ బకాయిలు చెల్లించాలి

### డిగ్రీ విద్యార్థుల భారీ ర్యాలీ ● ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యాన ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆర్‌టిసి కాంప్లెక్సు వద్ద రాస్తారోకో చేస్తున్న ఎస్‌ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలని, కాలేజీ, స్కూల్ దూర ప్రాంతాల్లో ఉండే కళాశాలలు, పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా బస్సు సౌకర్యం కల్పించాలని, జీవో నెంబర్ 77 రద్దు చేయాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు గురువారం నగరంలో ర్యాలీ, అనంతరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. తోటపాలెం ప్రాంతం నుంచి మయూరి కూడలి మీదుగా ఆర్‌టిసి కాంప్లెకుకు చేరుకున్నారు. అనంతరం అక్కడ రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు డి. రాము మాట్లాడుతూ పెండింగ్ లో ఉన్న స్కాలర్‌షిప్ బకాయిలు వెంటనే ప్రభుత్వం విద్యార్థుల ఖాతాలోకి వెయ్యాలని, పీజీ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్మెంట్ అందించాలని, బడి బస్సులు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రధానంగా ఆంధ్ర యూనివర్సిటీ పరిధిలో నవంబర్ 1 నుంచి సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమవుతున్నాయని ఈ సందర్భంలో ఫీజు పెండింగ్‌లో ఉండడంతో హాల్ టికెట్ ఇవ్వని దారుణమైన పరిస్థితి దాపురించిందని తెలిపారు. కావున తక్షణమే ప్రభుత్వం బాకీ పెట్టిన స్కాలర్ షిప్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కారం కాని యెడల విద్యార్థులను వారి తల్లిదండ్రులని ఏకం చేసి ప్రజా ప్రతినిధుల, అధికారుల ఆఫీసులను ముట్టడించాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ ఎఫ్ ఐ జిల్లా సహాయ కార్యదర్శి జె. రవికుమార్, మండల అధ్యక్ష , కార్యదర్శులు జి. సూరిబాబు, కె .రాజు, జిల్లా కమిటీ సభ్యులు జయ, యర్రమ్మ, నాయకులు గుణ, శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎయిర్‌పోర్టు బాధిత రైతుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలో 2700 ఎకరాల్లో ఇంటర్నేషనల్ గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర మార్క్‌ఫెడ్ ఛైర్మన్, టిడిపి నియోజకవర్గ ఇంఛార్జి కర్రోతు బంగార్రాజు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో ఆయన కలెక్టర్ రామసుందర్‌రెడ్డి, ఆర్‌డిఒ దాట్ల కీర్తిలను గురువారం కలసి రైతుల సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిర్ పోర్టు ప్రారంభమై కార్యకలాపాలు కొనసాగితే తమను ఎవరు పట్టించుకుంటారని భూ నిర్వాసితులు వాపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. భూ సేకరణ నాటి నుంచి నేటి వరకు ఎందరో అధికారుల మారుతున్నప్పటికీ రైతుల సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదన్నారు. ఎయిర్ పోర్టుకు భూములు ఇచ్చి రైతులు తీవ్రంగా నష్టపోయారని, ఇంకా కొంతమందికి భూ పరిహారం అందాల్సి ఉందని వారి సమస్య పరిష్కారమయ్యేందుకు కృషి చేయాలని కోరారు. ఆయన వెంట కవులవాడ ఎంపిటిసి ప్రతినిధి కోరాడ రాము, మండల తెలుగు రైతు అధ్యక్షులు రీసు రమణ, బాధిత రైతులు ఉన్నారు.

రహదారిపై గుంతల్లో చేరిన వర్షపునీరు

## అధ్వానంగా రహదారి

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలోని బొద్దాం నాలుగు రోడ్ల కూడలి నుంచి కళ్లెంపూడి మీదుగా చింతాడ వెళ్లే రహదారి చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతోంది. విశాఖ, విజయనగరం జిల్లాల రహదారులను అనుసంధానం చేసే కీలకమైన రహదారి ఇది. బొద్దాం నుంచి ఓబులయ్యపాలెం, ముకుందపురం, కళ్లెంపూడి, చింతాడ తదితర గ్రామాల మీదుగా సాగుతుంది. నిత్యం వేలాది మంది ఈ రహదారిపైనే ప్రయాణిస్తుంటారు. స్టోన్‌క్రషర్ భారీ వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగించడంతో తరచూ రహదారి ఛిద్రమైపోతోంది. ఎక్కడికక్కడే గుంతులు ఏర్పడిన ఈ ప్రధానరహదారి అస్తవ్యస్తంగా తయారైంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా రహదారి సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రహదారి సమస్యకు మోక్షం కల్పించాలని పలువురు కోరుతున్నారు.

ఇన్ఫోసిస్‌కు ఎంపికైన విద్యార్థినులను అభినందిస్తున్న సీతం డైరెక్టర్ మజ్జి శశిభూషణరావు

## ఇన్ఫోసిస్‌కు సీతం విద్యార్థినులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ఇన్ఫోసిస్‌కు జరిగిన పూల్ క్యాంపస్ డ్రైవ్ లో ఎంపికయ్యారు. వీరిలో ఒక విద్యార్థిని ఎమ్‌సిఎ నుంచి పిన్నింటి పూజిత, సిఎస్‌సి విద్యార్థిని పి.భాను తేజస్విని, ఇసిఇ విద్యార్థిని ముగడ స్వాతి ఎంపిక అయ్యారు. వీరికి సుమారు రూ.3.6లక్షలు ప్యాకేజీ ఆఫర్ చేశారు. ఈ సందర్భంగా సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు వీరికి అభినందనలు తెలిపారు.

# వైద్య కళాశాలల ప్రయివేటీకరణపై 28న ఆందోళనలు

- కేంద్రమంత్రిగా ఉత్తరాంధ్రకు రామ్మోహన్ చేసిందేమిటి?
- వైసిపి జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైసిపి నాయకులు

ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఈనెల 28న నియోజకవర్గ కేంద్రాల్లోను, నవంబర్ 12న జిల్లా కేంద్రంలోను ఆందోళనలు చేపడతామని వైసిపి జిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. పేద విద్యార్థుల భవిష్యత్తుకు వైసిపి అండగా ఉంటుందని అన్నారు. గురువారం తన నివాసంలో వైసిపి ప్రజా ఉద్యమం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చి ఏడాదిన్నగా పైగా అయినా ఉత్తరాంధ్రకు ఒక్క ప్రాజెక్టు గాని, అభివృద్ధి పనులు గానీ ఏమైనా రామ్మోహన్ నాయుడు చేశారా అని ప్రశ్నించారు. భోగాపురం ఎయిర్ పోర్టు గత వైసిపి హయాంలో భూసేకరణ, నిర్వాసితుల సమస్యలు, రీ హేబిలిటేష న్, న్యాయ పరమైన అడ్డంకులను తొలగించి 23శాతం పనులు పూర్తి చేశామన్నారు. మాజీ సిఎం వైయస్ జగన్ నిర్మించిన మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరిస్తూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై వెనక్కి తగ్గేదాకా రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు,మేధావులతో కలిసి ఉద్యమిస్తామని తెలిపారు. మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ప్రస్తుతం పార్టీ ఆధ్వర్యంలో జరుగుతున్న కోటి సంతకాల సేకరణతోపాటు ఈనెల 28న నియోజకవర్గాల పరిధిలో అవగాహన ర్యాలీలు నిర్వహిస్తామని తెలిపారు. నవంబర్ 24 నాటికి సంతకాల సేకరణ పూర్తవుతుందని, ఆ సంతకాల ప్రతులను జగన్ సమక్షంలో పార్టీ నాయకులంతా వెళ్లి రాష్ట్ర గవర్నర్‌కు అందజేస్తారని తెలిపారు. కోటి సంతకాల ఉద్యమానికి ప్రజలంతా స్వచ్ఛందంగా ముందుకొచ్చి మద్దతు ప్రకటిస్తున్నారని తెలిపారు.వైసిపి చేపట్టే ఆందోళనల్లో అన్ని వర్గాల ప్రజలు పాల్గొనాలని పిలుపునిచ్చారు. పార్వతీపురం మన్యం జిల్లాలో విద్యార్థుల మరణాలపై గిరిజన సంక్షేమశాఖా మంత్రి సంధ్యారాణి వ్యాఖ్యలు సరికావని అన్నారు. జ్వరమొస్తే తనకేంటి సంబంధమని చెప్పడం మంత్రికి తగదన్నారు. బాధ్యత వహించి ఆదుకుంటామని చెప్పాల్సిన ప్రభుత్వం బాధ్యతారాహితంగా మాట్లాడడం సరైనది కాదని అన్నారు.

జిల్లాలో రైతులు నష్టపోకుండా మొక్క జొన్న, పత్తి పంట కు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర కార్యదర్శులు కెవివి సూర్యనారాయణ రాజు, నెక్కల నాయుడు బాబు, జిల్లా ఉపాధ్యక్షులు అచ్చం నాయుడు, మూకల కస్తూరి, ప్రధాన కార్యదర్శులు నరసింహమూర్తి, రవి, ఇప్పిలి అనంత, జిల్లా అధికార ప్రతినిధి కనకల రఘురామారావు , సోషల్ మీడియా అధ్యక్షులు వాసు నాయుడు తదితరులు పాల్గొన్నారు

## ఐసిఆర్‌పిలపై రాజకీయాలు తగవు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రకృతి వ్యవసాయ ఐసిఆర్‌పిలపై రాజకీయాలు చేయడం తగదని సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.కామేశ్వరరావు మండిపడ్డారు. గురువారం అమర్ భవన్ లో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కామేశ్వరరావు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ మేనేజ్ నేచురల్ ఫార్మింగ్‌లో ఇంటర్నల్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సనల్ విధి నిర్వహణలో ఉన్న ఎనిమిది మందిని రాజకీయ ఒత్తిడి కారణంగా ఉద్యోగాలు తొలగించడం సరైన పద్ధతి కాదన్నారు. బొండపల్లి, గంట్యాడ, మెంటాడ మండలాల్లో 10 మంది ఏడేళ్లుగా విధులు నిర్వహిస్తున్నారని, వీరికి వేతనాలు చెల్లించకపోయినా పనిచేస్తున్నారని, స్థానిక రాజకీయాల ఒత్తిళ్లతో ఉద్యోగాలను నిలుపుదల చేయడం సమంజసం కాదని అన్నారు.

## 30 మందిపై బైండోవర్

ప్రజాశక్తి- రాజాం

అక్రమంగా మద్యం అమ్ముతున్న 30 మందిని తహశీల్దార్ వద్ద గురువారం బైండోవర్ చేసినట్లు ఎక్సైజ్ సిఐ జై భీమ్ తెలిపారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బెల్ట్ షాపులు నిర్వహిస్తూ పట్టుబడిన పాత నేరస్తులు, అనుమానితులను ఇప్పటి వరకు స్టేషన్ పరిధిలో 139 మందిని బైండోవర్ చేసినట్లు గుర్తుచేశారు. బైండోవర్ ప్రక్రియలో ఒక్కొక్కరికి రూ.లక్ష అపరాధ రుసుం పూచీకత్తులపై ఏడాది కాలవ్యవధి పరిమితి ఉంటుందన్నారు. బైండోవర్ తర్వాత కూడా అక్రమంగా మద్యం అమ్మితే జైలు శిక్షతోపాటు రెండు లక్షల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.

## పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-రామభద్రపురం

రామభద్రపురంలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షులు మజ్జి రాంబాబు కోరారు. మండలంలోని మిర్తివలస గ్రామంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. మండలంలో సుమారు 3 వేల ఎకరాల్లో పత్తి సాగవుతోందన్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం వల్ల రైతులు దళారులను నమ్మి మోసపోతున్నారని తెలిపారు. ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పిస్తే పత్తి రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి తక్షణమే పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు.

మంత్రి సత్యకుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే లలితకుమారి, నాయకులు

## మంత్రికి ఎమ్మెల్యే కోళ్ల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి కృతజ్ఞతలు తెలియజేశారు. శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రికి డయాలసిస్ సెంటర్‌ను మంజూరు చేసినందుకు గురువారం వెలగపూడి సచివాలయంలో మంత్రిని ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు కోళ్ల బాలాజీ రాంప్రసాద్, సర్పంచ్ ఎం.సీతారాంపాత్రుడు, నవీన్, సాగర్ కళ్యాణ్ పాల్గొన్నారు.

## ముఖేష్‌కు బంగారు పతకం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 11,12 తేదీల్లో జరిగిన స్కూల్ గేమ్స్ లో అండర్ 14 విభాగంలో ఎ. ముఖేష్ మణికంఠ గోల్డ్ మెడల్ సాధించాడు. నాగాలాండ్ లో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగిన అండర్ 14 జాతీయ స్థాయి తైక్వాండో పోటీలకు మన విజయనగరం నుంచి ఎంపికయ్యాడు. క్రీడాకారుడిని రాష్ట్ర తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి వేణుగోపాలరావు, జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షులు గురాన అయ్యలు, స్కూల్ గేమ్స్ సెక్రెటరీ గోపాల్ , విజయ , కోచ్ యశస్విని అభినందించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com



## బొబ్బిలిలో భారీ వర్షం

ప్రజాశక్తి -బొబ్బిలి

బొబ్బిలి పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. వర్షంతో మొక్కజొన్న, పత్తి రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మొక్కజొన్న కంకులు ఎండకపోవడంతో వ్యాపారులు కొనుగోలు చేయడం లేదు. పత్తి తడిసిపోవడంతో రైతులు నష్టపోతున్నారు. వరిపంట వెన్నుతో ఉండడంతో గాలితో వర్షం కురిస్తే నేలకొరిగే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## కూరగాయల మార్కెట్లో పశువుల సంచారం

ప్రజాశక్తి -బొబ్బిలి

పట్టణంలోని కూరగాయల మార్కెట్లో పశువులు విచ్చలవిడిగా సంచరిస్తున్నాయి. మార్కెట్ లోపలికి పశువులు ప్రవేశించి షాపుల్లో కూరగాయలను చిందరవందర చేస్తున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. వినియోగదారులపై పశువులు దాడి చేస్తున్నాయి. మున్సిపల్ అధికారులు గేట్లు ఏర్పాటు చేసినా, గేటు స్తంభాల మధ్య నుంచి పశువులు లోపలికి ప్రవేశిస్తున్నాయి. వెంటనే పశువులు మార్కెట్ లోపలికి రాకుండా చర్యలు తీసుకోవాలని వ్యాపారులు కోరుతున్నారు.

## ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి -బొబ్బిలి

ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలని ట్రాఫిక్ ఎస్ఐ జ్ఞానప్రసాద్ కోరారు. పట్టణంలోని సంస్థానం పాఠశాల రోడ్డులో గురువారం వాహనాలను తనిఖీ చేశారు. లైసెన్స్, వాహన పత్రాలు, ఇన్సూరెన్స్ లేకుండా వాహనాలను నడిపితే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే వాహన యజమానులపై కేసులు నమోదు చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించిన వాహనాలకు జరిమానా విధించారు.

## నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నెల్లిమర్ల సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం విద్యుత్ అంతరాయం కలుగుతుందని టౌన్ డిఇఇ పి.త్రినాధరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి విస్తరణ పనులు, వ్యవసాయ కనెక్షన్ పనులు కొనసాగిస్తున్నందున నెల్లిమర్ల సబ్ స్టేషన్ నుంచి గుర్ల రూరల్ ఫీడర్ పరిధిలో మొయిద నారాయణ పట్నం, పూతిక పేట, కొండగుంపాం, గరికిపేట, చింతల పేట, పెద మజ్జి పేట, నెల్లిమర్ల సిబిఎన్ కాలనీ పరిధిలో సిబిఎన్ కాలనీ, రామతీర్థం జంక్షన్, గొల్ల వీధి, చందక వీధి, బైరెడ్డి వీధి, చిక్కాల వీధి, పోలీస్ స్టేషన్, బిసి కాలనీ అలాబాన వీధి, శ్రీరాం నగర్ కాలనీ, ఇందిరా నగర్ కాలనీ, కారుకొండ వీధి, గాంధీ నగర్ కాలనీ, నెల్లిమర్ల టౌన్ ఫీడర్ పరిధిలో థామస్‌పేట, ఎస్‌బిఐ ఏరియా, మారుతి హాస్పిటల్, తెలగ వీధి, రెల్లి వీధి, జ్యూట్ మిల్, కొండపేట, 11కెవి వాటర్ వర్క్స్ పరిధిలో జరజాపు పేట పంప్ హౌస్, సాయి సుభద్ర థియేటర్ ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 4 గంట వరకు విద్యుత్‌కు అంతరాయం కలుగుతుందని వినియోగదార్లు సహకరించాలని ఆయన కోరారు.

## 21 మంది విద్యార్థులకు బయోమెట్రిక్

ప్రజాశక్తి- మెరకముడిదాం

ఈ నెల 23 నుండి 30వ తేదీ వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నారు. విద్యార్థుల మ్యాండేటరీ బయోమెట్రిక్ అప్డేట్ చేసే ప్రక్రియలో భాగంగా గర్భాం సచివాలయంలో గురువారం 21 మంది విద్యార్థులకు బయోమెట్రిక్ చేశారు. ఈ శిబిరాన్ని ఎంపిడిఒ గొర్లె భాస్కరరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఈ ఆధార్ ప్రత్యేక శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న దాసరి కార్పొరేషన్ చైర్మన్ రత్నాజీ, మాజీ ఎమ్మెల్సీ రఘువర్మ

## వాలీబాల్ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-కొత్తవలస

ఎస్‌జిఎఫ్ వాలీబాల్ డివిజన్ స్థాయి పోటీలు కొత్తవలస మండలంలోని దెందేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను దాసరి కార్పొరేషన్ చైర్మన్ పి.వి.రత్నాజీ, మాజీ ఎమ్మెల్సీ పి.రఘువర్మ ప్రారంభించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ కోళ్ల శ్రీను, ఎస్ఎంసి చైర్మన్ ఎం.రమణ, ఎస్‌జిఎఫ్ జిల్లా సెక్రటరీ కె. గోపాల్, డివిజన్ సెక్రటరీ తవిటయ్య, మాజీ సర్పంచ్ వి.శివాజీ, కె.కృష్ణంరాజు, బి.చంద్రశేఖర్, ఇన్‌ఛార్జి హెచ్‌ఎం కమలవాణి పాల్గొన్నారు.

## బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వావిలవలస ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేసి బదిలీపై వెళ్లిన చింత శ్రీధర్‌రావు, నడిపిల్లి వెంకటరమణ, చోడవరపు బాబురావులను ఎంఇఒలు ఎం వరప్రసాదరావు, ఎరకయ్య గురువారం శాలువాలతో ఘన సన్మానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందించారన్నారు. ప్రధానోపాధ్యాయులు పాలూరి రామకృష్ణ, మాజీ ఎంపిటిసి పాలూరు రామినాయుడు, విద్యా కమిటీ చైర్మన్ నెల్లి చిన్నమ్మ బదిలీ ఉపాధ్యాయులను సత్కరించారు.

## ప్రకృతి వ్యవసాయంతో రైతులకు మేలు

**కొత్తవలస :** ప్రకృతి వ్యవసాయంతోనే రైతులకు మేలని వ్యవసాయ శాఖ ఎడి విజయ తెలిపారు. మండలంలోని చీడివలస గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. బహుళ పంటలు, కిచెన్ గార్డెన్, పొలం గట్లపై మొక్కల పెంపకం తదితర అంశాల పట్ల రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిఎన్ఎఫ్ సిబ్బంది, నైరా వ్యవసాయ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## దుప్పట్లు పంపిణీ

**రామభద్రపురం :** రామభద్రపురంలోని షిరిడి సాయిబాబా ఆలయ ఆవరణలో 150 మంది పేదలకు గురువారం విశ్రాంత డిప్యూటీ తహశీల్దార్ చప్ప రామారావు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తనకు ఇస్తున్న పింఛను డబ్బుల్లో పేదలకు సహాయం చేయడం సంతృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో పెద్దపల్లి రామకృష్ణ, కేతిరెడ్డి రామారావు, రాము తదితరులు పాల్గొన్నారు.

## 140 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - డెంకాడ

మండలంలో నాతవలసలో దాట్ల మల్టీ స్పెషల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 140 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. హాస్పిటల్ ఎండి డి.శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఈ వైద్య పరీక్షలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ ఫౌండర్ దాట్ల సత్యనారాయణరాజు, వైసిపి మండల ఉపాధ్యక్షుడు బమ్మిడి వెంకటరమణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆరోగ్య తనిఖీలు చేస్తున్న దాట్ల హాస్పిటల్ వైద్యులు, సిబ్బంది

# మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకించండి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణను వ్యతిరేకించాలని ఎమ్మెల్సీ, వైసిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ పివివి సూర్య నారాయణ రాజు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, నియోజకవర్గ ఇంచార్జి నెక్కల నాయుడుబాబు పిలుపునిచ్చారు. గురువారం మొయిద విజయరాం పురంలో డాక్టర్ పెనుమత్స సురేష్ బాబు స్వగృహంలో పార్టీ ముఖ్య నాయకులతో వ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలలు ప్రయివేట్ పరం చేయడం వ్యతిరేకించాలని దీనిలో భాగంగా కోటి సంతకాలు సేకరణ జరిపి ఈ నెల 28న నియోజకవర్గం స్థాయిలో ధర్నా నిర్వహించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ల సుధారాణి, జెడ్‌పిటిసి గదల సన్యాసినాయుడు, నెల్లిమర్ల నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, వైస్ ఎంపిపిలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం, వైసిపి జిల్లా ఉపాధ్యక్షులు చనమల్ల తులసీరాం, వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ రాష్ట్ర అధికార ప్రతినిధి ధవల లక్ష్మణరావు, స్థానికసర్పంచ్ అట్టాడకృష్ణ పాల్గొన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్సీ సురేష్‌బాబు, మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ తదితరులు

**పూసపాటిరేగ :** స్థానిక వైసిపి కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షులు పతివాడ అప్పలనాయుడు ఆధ్వర్యాన మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు మహంతి జనార్ధనరావు, మహంతి శ్రీనివాసరావు, మహంతి లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

**వంగర:** ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పిపిపి పేరుతో ప్రైవేటీ కరణ చేసేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతుందని ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, రాజాం నియోజకవర్గ వైసిపి ఇంచార్జి డాక్టర్ తలే రాజేష్ అన్నారు. వైసిపి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో కోటి సంతకాలు సేకరణ కార్యక్రమాన్ని వైసిపి మండల అధ్యక్షుడు కరణం సుదర్శన రావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద మధ్యతరగతి విద్యార్థులు చదువుకో వలసిన మెడికల్ కాలేజీలను ప్రైవేటు పరం చేసేందుకు కూటమి ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తుం దన్నారు. అనంతరం ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకులు సూర్యనారాయణ రాజు, ఎంపిపి ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ, వైస్ ఎంపిపి కిమిడి ఉమామహేశ్వరరావు, యూత్ లీడర్ బొక్కేల వెంకట అప్పలనాయుడు, కనగల పద్మ, కాంబోతుల భగవతి తదితరులు పాల్గొన్నారు.

# తెగుళ్ల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి : ఆత్మ పీడీ

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

పంటలకు వచ్చే తెగుళ్లపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆత్మ పీడీ ఆర్.శ్రీనివాసరావు.. రైతులకు సూచించారు. గురువారం మండలంలోని అలజంగి సచివాలయంలో రైతులకు వరి, అపరాల పంటలో సస్యసంరక్షణ విధానాలపై శిక్షణ నిర్వహించారు. వరి పంటపై వివిధ రకాల తెగుళ్లు, చీడపీడల నివారణలపై తగు సూచనలు చేశారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ కెల్లా లక్ష్మణరావు, శాస్త్రవేత్త తేజేశ్వరరావు, వ్యవసాయ శాఖ ఎడి ఎం.మధుసూదన్‌రావు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ సిబ్బంది సలహాలతోనే పురుగుల మందులు పిచికారీ చేయాలి తప్ప వ్యాపారులపై ఆధారపడవద్దని సూచించారు. ఫెర్టిలైజర్ షాపుల వ్యాపారుల సలహాలు పాటిస్తే, రెండు మూడు సార్లు పురుగుల మందులు వినియోగించాల్సిన పరిస్థితి వస్తుందని చెప్పారు. వ్యవసాయ శాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ అవసరం మేరకు పురుగుమందులు వాడాలని కోరారు. అపరాల దిగుబడుల కోసం ఏ పద్ధతులు పాటించాలో రైతులకు శిక్షణ ఇచ్చారు. రైతులకు టమోటా, వంగ నారు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎఒ ఎం.శ్యామసుందర్, వీఎఎలు పెంట లత, వేణుగోపాల్ పాల్గొన్నారు.

నారును పంపిణీ చేస్తున్న ఆత్మ పీడీ శ్రీనివాసరావు

కాలువలో పేరుకుపోయిన మురుగు

## పెదమానాపురంలో అపారిశుధ్యం

### అవస్థలు పడుతున్న జనం

ప్రజాశక్తి-దత్తిరాజేరు

మండలంలోని పెదమానాపురం గ్రామంలో అపారిశుధ్యం విళయతాండవం చేస్తోంది. ప్రధానంగా కిలుగువీధిలో కాలువలు మురుగునీటితో నిండిపోయాయి. కాలువలు అస్తవ్యస్తంగా ఉండటం వల్ల మురుగునీరు ఎటూ వెళ్లకపోవడంతో రోడ్డుపైకి చేరుతోంది. ఈ రోడ్డుపై నడవడానికి కూడా గ్రామస్తులు నరకయాతన అనుభవిస్తున్నారు. ముక్కుమూసుకుని వెళ్లాల్సిన దుస్థితి నెలకొంది. కాలువల్లో చెత్త పేరుకుపోవడంతో దోమలు విపరీతంగా పెరిగి గ్రామస్తులు రోగాల బారిన పడుతున్నారు. గ్రామంలో అన్ని వీధుల్లోనూ ఇదే సమస్య వెంటాడుతోంది. సర్పంచ్ మరణించిన తర్వాత గ్రామంలో పారిశుధ్య పనులు పూర్తిగా చేపట్టలేదని గ్రామస్తులు చెబుతున్నారు. వెంటనే అధికారులు స్పందించి గ్రామంలో పారిశుధ్య పనులు చేపట్టాలని కోరుతున్నారు.

## రామతీర్థం హుండీ ఆదాయం రూ.28.66లక్షలు

ప్రజాశక్తి - నెల్లిమర్ల

రామతీర్థం రామస్వామి దేవస్థానం ఆదాయం రూ. 28.66లక్షలు వచ్చింది. గురువారం స్థానిక రామస్వామి దేవాలయం ఆవరణలో మే నెల 28 నుంచి ఈ నెల 23 వరకు 150 రోజులకు ధర్మ హుండీలు లెక్కించగా ఈ ఆదాయం వచ్చింది. ఈ ధర్మ హుండీలలో లెక్కింపు జిల్లా దేవాదాయ ధర్మదాయ శాఖ సహాయ కమిషనర్ కె.శిరీషా పర్యవేక్షణలో దేవస్థానం సహాయ కమిషనర్ వై. శ్రీనివాసరావు, విజయనగరం ఇన్‌స్పెక్టర్ జి.శ్యామ్‌ప్రసాద్, కొట్టాం దేవస్థానం కార్యనిర్వాహనాధికారి జి.శ్రీనివాస్, బొబ్బిలి వేణుగోపాలస్వామి దేవస్థానం కార్యనిర్వాహధికారి సిహెచ్.టి.వి.ఆర్.లక్ష్మణరావు, నెల్లిమర్ల పోలీస్ శాఖ, రామతీర్థం గ్రామ సచివాలయం సిబ్బంది. శ్రీవారి సేవా సంఘం, రామతీర్థం గ్రామీణ బ్యాంకు సిబ్బంది, దేవాలయం సిబ్బంది పాల్గొన్నారు.

## ఎపిజిబి ఖాతా అప్‌డేట్ తప్పనిసరి

ప్రజాశక్తి-వేపాడ

పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందుతున్న, ఎపిజిబిలో జాయింట్ ఖాతా ఉన్న విద్యార్థులకు అలెర్ట్. ఎపిజిబి కొత్తగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ శాఖలుగా విడిపోయిన విషయం తెలిసిందే. ఎపిజివిబిలో జాయింట్ అకౌంట్ కలిగి, పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పొందుతున్న విద్యార్థులు తమ బ్రాంచిని సంప్రదించి, అప్‌డేట్ చేసిన కొత్త అకౌంట్, ఐఎఫ్ఎస్‌సి నంబరు తీసుకోవాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ అకౌంట్ జిరాక్సు కాపీని సచివాలయంలో వెల్ఫేర్ సెక్రటరీ ద్వారా 'జ్ఞానభూమి' లాగిన్‌లో 'ఆర్‌టిఎఫ్ - జాయింట్ అకౌంట్ ఎంట్రీ' అనే ఆప్షన్‌లో అప్‌డేట్ చేసుకోవాలని చెప్పారు. ఇందుకు ఈ నెల 27వ తేది ఆఖరని, విద్యార్థులు బ్యాంకు ఖాతాను అప్‌డేట్ చేసుకోకుంటే స్కాలర్‌షిప్ వచ్చే అవకాశం లేదని తెలిపారు. పోస్టుమెట్రిక్ స్కాలర్‌షిప్‌కు ఎపిజివిబి జాయింట్ అకౌంట్ ఇచ్చిన వారు మాత్రమే అప్‌డేట్ చేసుకోవాలని పేర్కొన్నారు. మిగతా బ్యాంకులకు సంబంధించి జాయింట్ అకౌంట్ ఇచ్చిన విద్యార్థులు సచివాలయంలో ఎటువంటి అప్‌డేట్ చేసుకోనవసరం లేదని వెల్లడించారు.

## కల్లు గీత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కల్లుగీత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని చేతి వృత్తి దారుల సమన్వయ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులు డిమాండ్ చేశారు. గురువారం అమర్‌భవన్‌లో కల్లుగీత కార్మికుల సమావేశం పురం అప్పారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గీత కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, 50ఏళ్లకే పింఛన్ ఇవ్వాలని, పోరాడి సాధించుకున్న పింఛన్లను పక్కాగా అమలు చేయాలని, గీత కార్మికులకు జిల్లాలో నిరా పరిశ్రమ ఏర్పాటు చేయాలని పెండింగ్‌లో ఉన్న ఎక్స్‌గ్రేషియోలు తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2013 నుండి నేటి వరకు గీత కార్మికుల సహకార సంఘాలకు ఎన్నికలు జరపలేదని, తక్షణమే రాజ్యాంగబద్ధంగా ఎన్నికలు జరపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు పి.కామేశ్వరరావు, సహాయ కార్యదర్శి బుగత అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఎండిఎం బిల్లులు చెల్లించాలి

ప్రజాశక్తి- డెంకాడ

మండలంలో అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజన పథకం బిల్లులు వెంటనే చెలించలచాలని సిఐటియు జిల్లా కార్యదర్శి బచ్చల సూర్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం ఎండిఎం కార్మికులతో కలిసి ఆయన తహశీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు నెలలు బిల్లులు బకాయిలు ఉన్నాయని వాటిని చెల్లించాలని కోరారు. నాలుగు నెలల క్రితం పెరిగిన మెనూ బిల్లులను వేయాలన్నారు. మధ్యాహ్నం భోజన పథకం నిర్వాహకులుగా పని చేస్తున్న వారిని గుర్తించి వారికి నెల జీతాలు ఇవ్వాలని కోరారు. కార్మికులకు అందరికీ యూనిఫారం అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్నం భోజన కార్మికులు అచ్చియమ్మ, మంగమ్మ, సత్యవతి, రాములమ్మ, కొండమ్మ, పద్మ, బి.సత్తిబాబు పాల్గొన్నారు.

## బడ్డీలను తొలగించి..బాలికలకు రక్షణ కల్పించాలి

### జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటాన

ప్రజాశక్తి - చీపురుపల్లి

స్థానిక అంబేద్కర్ బాలికల గురుకల పాఠశాల ప్రహరీ గోడను ఆనుకొని అక్రమంగా ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించి పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు రక్షణ కల్పించాలని జిల్లా సామాజిక న్యాయ ఉద్యమ వేదిక కన్వీనర్ గంటానా అప్పారావు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం చీపురుపల్లి ప్రెస్ క్లబ్ వద్ద దళిత నాయకులతో కలసి విలేకరులతో ఆయన మాట్లాడారు. తాజాగా తునిలో జరిగిన సంఘటనను ఆధారంగా చేసుకొని గురుకుల పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థులకు అధికారులు రక్షణ కల్పించాలన్నారు.దళిత పేద విద్యార్థుల చదువుల కోసం రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్చుకుంటుండగా వారి సమస్యలను పాలకులు గానీ అధికారులు గానీ కనీసం పట్టించుకోవడం లేదన్నారు. చీపురుపల్లి అంబేద్కర్ గురుకులానికి ఆనుకొని ఏర్పాటు చేసిన బడ్డీలను తొలగించాలంటూ గతంలో జిల్లా కలెక్టర్ కి కూడా ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు చర్యలు చేపట్టలేదని ఆయన ఆరోపించారు. విద్యార్థినిలకు రక్షణ కల్పిస్తూ అధికారులు తదుపరి చర్యలు చేపట్టకపోతే దళిత సంఘాల ఆధ్వర్యంలో పోరుబాట పడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో దళిత నాయకులు సంజీవి, సూర్యనారాయణ, వర్రీ రమేష్, భీంపల్లి రాము పాల్గొన్నారు.

## పాఠశాల భవన నిర్మాణంపై ఫిర్యాదు

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని పాత చెరుకుపల్లి గ్రామ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరి కూలేందుకు సిద్ధంగా ఉంది. అక్కడ విద్యార్థులకు పాఠాలు చెప్పలేక వేరే అద్దె భవనంలో కొంతకాలంగా పాఠశాలను నడుపుతున్నారు. కొత్త భవనం నిర్మించాలని పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులను కోరినా స్పందన లభించడం లేదని గ్రామానికి చెందిన రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల భవనం దెబ్బతిని ఎప్పుడైనా కూలే పరిస్థితిలో ఉందని, దానిని తొలగించి కొత్త భవనం నిర్మించాలంటే సరిపడా స్థలం లేని కారణంగా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆయన తెలిపారు. వేరే గ్రామానికి వెళ్లి చదవడం పేద పిల్లలకు సాధ్యం కాకపోవడంతో చాలామంది చదువులు మానేస్తున్నారని విచారం వ్యక్తం చేశారు. తన పింఛన్ నుంచి ప్రతి నెల రూ.3వేలు ఖర్చు చేసి అద్దె భవనంలో పాఠశాల కొనసాగించేలా చేస్తున్నానని చెప్పాడు. సమస్యపై పలుమార్లు మండల, జిల్లా స్థాయి అధికారులను కలిసినా పరిష్కారం లభించకపోవడంతో రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శికి వినతిపత్రం సమర్పించానని చెప్పారు.అధికారులు, ప్రభుత్వం స్పందించి గ్రామంలో కొత్త పాఠశాల భవనం నిర్మించాలని కోరారు.

## మద్యం ప్రియులకు ఎమ్‌పి అవగాహన

ప్రజాశక్తి - భోగాపురం

అక్రమ మద్యం పై వస్తున్న ఆరోపణల నేపథ్యంలో ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం చేపట్టిన ప్రజా భద్రత ప్రచార కార్యక్రమంలో భాగంగా బుధవారం లింగాలవలస గ్రామ సమీపంలో ఉన్న వైన్ షాపు వద్ద మద్యం ప్రియులకు ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు, మార్కెఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మద్యం నాణ్యతను మొబైల్ యాప్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. అక్రమ మద్యం నివారణకు అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. మద్యం కొనుగోలు చేసేటప్పుడు ప్రభుత్వం విడుదల చేసిన సురక్ష యాప్ ద్వారా మద్యం సీసాపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి మద్యం నాణ్యతను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యన్నారాయణ, క్లస్టర్ ఇంచార్జి దాసరి అప్పలస్వామి, బుగత రామ్మోహన్, కోరాడ తాతారావు, తెలుగు రైతు అధ్యక్షులు రీసు రమణ, యూనిట్ ఇంచార్జి కొండపు, ఓదురు నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

## రెండు తులాల పుస్తెల తాడు చోరీ

ప్రజాశక్తి-రాజాం

రాజాం మండలం పెనుబాక గ్రామానికి చెందిన గంగు భాగ్యలక్ష్మి మార్కెట్ పని మీద తన భర్త సురేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై గురువారం రాజాం వెళ్తుండగా గాయత్రి కాలనీ ప్రభాకర్ స్కూల్ సమీపంలో ముగ్గురు గుర్తుతెలియని దుండగులు ద్విచక్ర వాహనంపై వెనుకు నుండి వచ్చి ఆమె మెడలోని రెండు తులాలు బంగారు పుస్తెలతాడు తెంపుకొని పారిపోయారు. భాగ్యలక్ష్మి కింద పడడంతో స్వల్ప గాయాలయ్యాయి. బాధితులు పోలీస్ స్టేషన్ కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రవికిరణ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజన వేషధారణలో విద్యార్థినులు

## కళా ప్రతిభను వెలికితీయాలి

### సెట్విజ్ సిఇఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- విజయనగరం కోట

యువతలో ఉన్న కళా ప్రతిభను వెలికి తీయడానికి ప్రతి సంవత్సరం యువజన ఉత్సవాలను నిర్వహిస్తున్నామని సెట్విజ్ సిఇఒ డి. వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం మహారాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవాలను జ్యోతి వెలిగించి ప్రారంభించారు.పలువురు కళాకారులు పాటలు, నృత్యాలతో అలరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏటా యువజన ఉత్సవాలను జిల్లా స్థాయిలో నిర్వహించి ఇందులో ప్రథమ స్థానం పొందిన వారిని విజయవాడలో జరుగు రాష్ట్ర స్థాయికి పంపుతామని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం పొందిన విజేతలు స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని తెలిపారు. జిల్లా యువజన ఉత్సవాల్లో సుమారు 200మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో సంగీత కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ మండపాక నాగలక్ష్మి, సెట్విజ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇకెవైసి చేయకపోతే ఉపాధి కట్

ప్రజాశక్తి- సంతకవిటి

ఈ నెల 25లోపు ఇకెవైసి చెయ్యకపోతే ఉపాధి పనులకు దూరమవుతారని ప్రతి ఒక్క ఉపాధి కూలీ ఇకెవైసి చేయించుకోవాలని ఎంపిడిఒ కె. సురేష్ గురువారం తెలిపారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లు లేదా టెక్నికల్ అసిస్టెంట్ల వద్ద ఇకెవైసి చేయించుకోవచ్చు అన్నారు. ఇకెవైసి చేయించుకోని వేతనదారులను డిసెంబర్ నెల నుంచి ఉపాధి హామీ పనుల్లోకి తీసుకోబోమని హెచ్చరించారు. విద్యార్థులు, పిల్లల ఆధార్ వివరాల సవరింపు కోసం మండల పరిధిలో ఈ నెల 23 నుంచి 30 వరకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. సంతకవిటి, మామిడిపల్లి, సిరిపురం, మంతిన సచివాలయాల్లో ప్రత్యేక ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ ఆధార్ వివరాలను సరిచేయించుకోవాలని సూచించారు. ఈ ఆధార్ శిబిరాల్లో బయోమెట్రిక్ అప్‌డేషన్ సేవలు ఉచితంగా అందిస్తారన్నారు.

## వ్యాసరచన పోటీలకు విశేష స్పందన

ప్రజాశక్తి -బొబ్బిలి

పోలీస్ అమరవీరుల వారోత్సవాలలో భాగంగా గురువారం పట్టణంలోని వాసు, తాండ్ర పాపారాయ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఐటిఐలో మహిళలు, బాలికలపై లైంగిక వేధింపులు నివారణలో విద్యార్థుల పాత్ర అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీలకు విశేష స్పందన లభించింది. వ్యాసరచన పోటీలను పట్టణ సిఐ క్. సతీష్ కుమార్ పరిశీలించారు. లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ చెప్పారు. లైంగిక వేధింపులకు పాల్పడితే పడే శిక్షలపై అవగాహన కల్పించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎంపిటిసికి పితృవియోగం

ప్రజాశక్తి - గుర్ల

మండల వైసిపి యువ నాయకుడు, బూర్లెపేట ఎంపిటిసి బూర్లే జోగినాయుడు తండ్రి చిన్నంనాయుడు గురువారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. రెండు రోజుల క్రితం తన స్వగ్రామం చిన్నంనాయుడు వ్యవసాయ పనులు చేసుకుంటూ ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అతన్ని విజయనగరం ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ రెండుసార్లు గుండెపోటు రావడంతో మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని గ్రామంలోకి వెళ్లి వైసిపి నాయకులు కెవి సూర్యనారాయణరాజు, పొట్నూరు సన్యాసినాయుడు, జెడ్‌పిటిసి శీర అప్పల నాయుడు, మధు, బెల్లాన బంగారునాయుడు, తోట తిరుపతిరావు, వరద ఈశ్వర్ రావు, మాజీ ఎంపిపి సనాయసినాయుడు సందర్శించి నివాళులర్పించారు.

## నేరాలు ఘోరాలు

## రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - గజపతినగరం

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన పలువురిని కలచివేసింది. గురువారం తెల్లవారుజామున దావాలపేట గ్రామ పరిధిలో ఉన్న రైల్వేగేట్‌కి అతి సమీపంలో గుర్తు తెలియని రైలు కిందపడి తుమ్మికాపల్లి గ్రామానికి చెందిన నడిపల్లి వెంకటేష్ (21) ఆత్మహత్య చేసుకున్నాడు. వెంకటేష్ తండ్రి పైడిరాజు సుమారు మూడు నెలల క్రితం అనారోగ్య సమస్యలతో మరణించాడు. దీంతో మనస్తాపం చెంది వెంకటేష్ ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే హెచ్‌సి డి.రత్నకుమార్ తెలిపారు. గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటన స్థలానికి ఆయన చేరుకున్నారు. కేసు నమోదు చేసినట్లు హెచ్‌సి తెలిపారు.

## పాముకాటుతో మహిళ మృతి

ప్రజాశక్తి-గజపతినగరం

మండలంలోని కొనిశ గ్రామానికి చెందిన సూరెడ్డి అన్నపూర్ణ (47) గురువారం పాముకాటుతో మృతి చెందింది. పత్తి తోటలో పనులు చేస్తుండగా పాము కాటేసిందని, వెంటనే గజపతినగరం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స కోసం తీసుకొని వెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్ నిర్ధారించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. మృతిరాలికి భర్త బుచ్చి, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అన్నపూర్ణ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## మహిళ ఆత్మహత్య

ప్రజాశక్తి- కంటోన్మెంట్

విజయనగరం మండలం గొల్లలపేట - కొత్త కాపు పేట సమీపంలో పూరిపాకలో బాడుతిమాను గురమ్మ (58) చీరతో ఉరి వేసుకొని గురువారం ఆత్మహత్య చేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం.. గుర్రమ్మ గత కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతుంది. నొప్పి భరించలేక ఆత్మహత్యకు పాల్పడింది. గురమ్మ భర్త రామునాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు విజయనగరం ఎస్ఐ వి. అశోక్ కుమార్ తెలిపారు

## గంజాయి కేసులో ఇద్దరికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి -కంటోన్మెంట్

ఎన్.కోట పోలీసు స్టేషన్‌లో 2018.లో నమోదైన గంజాయి కేసులో అల్లూరి సీతారామరాజు జిల్లా డుంబ్రిగూడ మండలానికి చెందిన కిముడు జయరాం (22), అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలానికి చెందిన దత్తి ప్రవీణ్ (22) మూడేళ్ల జైలు శిక్ష, రూ.20వేలు చొప్పున జరిమానా విధిస్తూ విజయనగరం ఫస్ట్ అడిషనల్ డిస్ట్రిక్ట్ అండ్ సెషన్స్ జడ్జి ఎం.మీనాదేవి గురువారం తీర్పు వెల్లడించినట్టు ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. ఎస్.కోట పోలీసు స్టేషన్ పరిధి ఆకుల డిపో ప్రాంతంలో ద్విచక్ర వాహనంపై గంజాయి రవాణా చేస్తున్నట్టు వచ్చిన సమాచారంతో ఎస్.కోట పోలీసులు ఆకుల డిపో వద్ద అనుమానాస్పదంగా ఉన ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకొని ద్విచక్ర వాహనం తనిఖీ చేసి 3.750 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై అప్పటి సిఐ బి.వెంకటరావు దర్యాప్తు చేపట్టి అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో నిందితులకు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.